# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047 డాక్యుమెంట్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రానున్న 30 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.
- రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.
- శక్తి, వనరుల ఆదాతోనే భవిష్యత్తులో విద్యుత్ భరోసా ఉంటుందని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణ మూర్తి పేర్కొన్నారు.
- సత్వర న్యాయం పొందటానికి జాతీయ లోక్ అదాలత్ లు ఎంతో దోహదపడతాయని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు.

========================

రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047 డాక్యుమెంట్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈరోజు విజయవాడలో ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర విజన్ - 2047 డాక్యుమెంట్ పై విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతీ చోటా చర్చ జరగాలని సూచించారు. భవిష్యత్ తరాల బాగు కోసం చేసే ఈ ప్రయత్నంలో అందరి భాగస్వామ్యం కావాలని కోరారు. విజన్ 2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలన్నారు. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామన్నారు. ఈసారి నిర్వహించే కలెక్టర్ల సమావేశంలో పలు మార్పులు తీసుకొస్తామని.. సుదీర్ఘ సమీక్షలకు అవకాశం లేకుండా ప్రశ్నలు, సమాధానాల రూపంలో నిర్వహిస్తామని వివరించారు. అంతకు ముందు పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ముఖ్యమంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

========================

రానున్న 30 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ రోజు అమరావతి ప్రాంతంలోని పలు గ్రామాల్లో మంత్రి పర్యటించారు. 16వ నెంబరు జాతీయ రహదారికి అనుసంధానం చేసే E-11, E-13 రహదారులు నిర్మించే ప్రాంతాలు, పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... రాజధాని ప్రాంతం నుంచి E-11, E-13, E-15 రహదారులను  జాతీయ రహదారికి అనుసంధానం చేసే విధంగా డిజైన్లు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే 22 వేల కోట్ల రూపాయాల విలువైన పనుల టెండర్లకు రాజధాని ప్రాంత అభివృద్ధి మండలి ఆమోదం తెలిపిందని, మరో 20 వేల కోట్ల రూపాయలకు సోమవారం జరిగే సీఆర్‌డీఏ సమావేశంలో ఆమోదం తీసుకుంటామని పేర్కొంటూ..

(వాయిస్ 37 సెకన్లు)

========================

శక్తి, వనరుల ఆదాతోనే భవిష్యత్తు లో విద్యుత్ భరోసా ఉంటుందని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణ మూర్తి పేర్కొన్నారు.  రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు వివిధ జిల్లాల్లో ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ వారోత్సవాల ర్యాలీలో కృష్ణ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంధనం ఆదా చేయటం అందరి బాధ్యతని అన్నారు.

ఎంతో విలువైన విద్యుత్, ఇంధన వనరులను పొదుపుగా వాడుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (సౌర విద్యుత్) పథకం అమలుతో జిల్లాలోని ప్రతి ఇల్లూ సూర్య ఘర్ కావాలని ఆకాంక్షించారు.

దేశంలో పెరిగిపోతున్న విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు సంప్రదాయేతర ఇంధన వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని ఏపి ఈపిడిసిఎల్ విజయనగరం సర్కిల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన ర్యాలీలో సంయుక్త కలెక్టర్ నిషాంతి మాట్లాడుతూ... సమిష్టిగా ఇంధన పొదుపును ఆచరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాబోయే తరాలకు సహజ వనరులను అందించాలని పేర్కొంటూ..

(వాయిస్ 37 సెకన్లు)

విరామం

========================

మావోయిస్టులు, తీవ్రవాదులతో పోరాటం చేయడంలో పోలీసు బెటాలియన్ కు ఎంతో చరిత్ర ఉందని విజయనగరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్  అన్నారు. విజయనగరం 5వ బెటాలియన్ చింతలవలస ఏపీఎస్పీ పరేడ్ మైదానంలో వార్షిక పోలీసు క్రీడా పోటీలను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ బెటాలియన్ పోలీసుల సేవలతో ప్రజలు సురక్షితంగా ఉండగలుగుతున్నారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందిలో స్ఫూర్తిని నింపేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ మాట్లాడుతూ... పోలీసు ఉద్యోగులకు ఈ క్రీడలు ఉపశమనం, ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. తొలి రోజు 800 మీటర్లు పరుగు పందెం, షాట్ పుట్, జావెలిన్ త్రో, బాస్కెట్ బాల్, క్రికెట్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందించారు.

========================

అపరిష్కృతంగా ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని తిరుపతి జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీ పేర్కొన్నారు. ఈరోజు జిల్లాలోని శ్రీకాళహస్తి న్యాయ సముదాయంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో వారు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ... లోక్ అదాలత్ లో రాజీ చేసుకునే సివిల్ కేసుల్లో కోర్టుకు చెల్లించిన రుసుమును కక్షిదారులు తిరిగి పొందవచ్చునని తెలిపారు. సత్వర న్యాయం పొందటానికి జాతీయ లోక్ అదాలత్ లు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొంటూ ...

(వాయిస్ 34 సెకన్లు)

కాగా ఈ రోజు తిరుపతి, అనంతపురం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, చిత్తూరు, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల్లో 4వ జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు.

========================

రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంలో ఎచ్చెర్ల, రణస్థలం, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఈ రోజు ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సమావేశంలో తెలుసుకున్నామని, వాటి పరిష్కారానికి భరోసా ఇచ్చామని తెలిపారు. తారక రామ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి పైడి భీమవరం పారిశ్రామిక వాడలో మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. యువతలో నైపుణ్య అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని, పైడి భీమవరం పారిశ్రామిక వాడలో ప్రస్తుతం 30 వేల మంది ఉద్యోగులు ఉండగా, ఆ సంఖ్యని 50 వేలకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

========================

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చే సంవత్సరం జనవరి 10 నుండి 19వ తేది వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. చంటి పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు విశేష దర్శనాలు, ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు ఈ పది రోజుల పాటు రద్దు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

========================
========================